క్లుప్తంగా

తిరుచ్చిపై సీతారాముల విహారం



ఊరేగుతున్న సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రుడు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారికి అనుబంధంగా వెలసిన శ్రీసీతారాముల వారు బుధవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై దర్శనమిచ్చారు. సీతాలక్ష్మణ సమేతంగా తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఏఈఓ గోపీనాథ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థినిపై లైంగికదాడి దారుణం



నిరసన తెలుపుతున్న లా విద్యార్థులు

తిరుపతి సిటీ : విశాఖపట్నంలో న్యాయ విద్యార్థినిపై తోటి విద్యార్థులు లైంగికదాడికి పాల్పడడం దారుణమని, నిందితులను కఠినంగా శిక్షించాలని షనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎన్‌ఎల్‌ఎస్‌ఏ) నేతలు మండిపడ్డారు. బుధవారం ఈ మేరకు ఎస్వీయూ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఎన్‌ఎల్‌ఎస్‌ఏ వ్యవస్థాపక అధ్యక్షుడు సుందరరాజు మాట్లాడుతూ ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి అసభ్యకర వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేస్తూ సభ్యసమాజం తలదించుకునేలా లైంగికదాడికి పాల్పడడం హేయమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు రెడ్డి మోహన్, ఉత్తరాది విజయ్, ముఖేష్, చెన్నకేశవులు, యోగేశ్వర్ పాల్గొన్నారు.

కల్కి భవనం కూల్చివేతకు డిమాండ్

తిరుపతి కల్చరల్ : వరదయ్యపాళెంలో పేదల భూములు ఆక్రమించి నిర్మించిన కల్కి ఆశ్రమ భవనం కూల్చివేయాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మా ట్లాడారు. 20 ఏళ్లుగా కల్కి ఆక్రమణలపై ఫిర్యా దులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వెంటనే కల్కి ఆశ్రమం తొలగించి సదరు భూమిని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో మునిచంద్రశేఖర్, రాజేశ్వరి, అనసూయమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

అంబేడ్కర్ లా కళాశాలలో ఫ్రెషర్స్ డే



అతిథులకు జ్ఞాపిక అందిస్తున్న చైర్మన్ తిప్పారెడ్డి

తిరుపతి సిటీ : స్థానిక అంబేడ్కర్ గ్లోబల్ కళాశాలలో బుధవారం ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు ముఖ్య అతిథిగా హాజరై మట్లాడారు. సమాజంలో న్యాయశాస్త్రం అభ్యసించిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, స్పేస్ లా, ఎన్విరాన్‌మెంట్ లా తదితరాలపై సూచనలు చేశారు. కళాశాల చైర్మన్ తిప్పారెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ లా కళాశాలలో చదివిన సుమారు వంద మంది విద్యార్థులు న్యాయమూర్తులుగా రాణిస్తున్నారని, ఇటీవల హైకోర్టు జడ్జిగా నియమితులైన కె.మహేశ్వర రావు సైతం పూర్వ విద్యార్థేనని తెలిపారు. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి గురప్పనాయుడు పాల్గొన్నారు.

టీటీడీ అదనపు ఈఓ తనిఖీలు



లైసెన్స్ పరిశీలిస్తున్న టీటీడీ అదనపు ఈఓ

తిరుమల : టీటీడీ అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి బుధవారం సాయంత్రం తిరుమలలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. డీఎంబీ రోడ్డులోని అన్నపూర్ణ హోటల్‌తోపాటు పలు దుకాణాల లైసెన్సులు పరిశీలించారు. టీ దుకాణంలో టీ సేవించి ధరలను అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ ఈఓ మాట్లాడుతూ అన్నపూర్ణ హోటల్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పరిశీలించామన్నారు. ఇంజినీరింగ్ అధికారుల నివేదిక ఆధారంగా భవనంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. తిరుమలలో అనధికారికంగా వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ ఈఓ ఆశాజ్యోతి, డీఈ ఎస్.చంద్ర శేఖర్, వీజీఓ సురేంద్ర, ఏఈఓ నారాయణ చౌదరి పాల్గొన్నారు.

24న జాతీయ కవి సమ్మేళనం

తిరుపతి కల్చరల్ : అన్నమయ్యపై ఈనెల 24వ తేదీన జాతీయ కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలుగు రచయితల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కన్నయ్య బుధవారం తెలిపారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

తిరుపతి క్రైమ్ : నగరంలో బుధవారం ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. మునిబాబు(35) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పుల బాధ తాళలేక ప్రసూతి ఆస్పత్రి ఆవరణలో చెట్టుకు ఉరేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.





తొలగించిన పిట్టగోడ

క్షణ క్షణం.. భయం భయం!

- శిథిలావస్థలో శ్రీహరి బస్టాండ్ భవనం
- పిట్టగోడను తొలగించి నెలలు గడుస్తున్నా.. చేపట్టని నిర్మాణం
- వర్షం వస్తే పైకప్పు నుంచి ఊడి పడుతున్న పెచ్చులు
- గాయపడుతున్న ప్రయాణికులు
- బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి ప్రపంచం నలు మూల నుంచి యాత్రికులు తరలివస్తుంటారు. వివిధ వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఆర్టీసీ బస్సుల్లోనే ఎక్కువ మందిభక్తులు తిరుమలకు వెళుతుంటారు. ప్రధానంగా శ్రీహరి బస్టాండ్ నుంచి కొండకు బయలుదేరుతుంటారు. ఈ నేపథ్యంలో ప్రయాణ ప్రాంగణం నిత్యం రద్దీగా ఉంటుంది. ఒక్కోసారి కాలు మోపేందుకు కూడా జాగా లేకుండా కిక్కిరిసి పోతుంది. కానీ, వేలాది మంది శ్రీవారికి భక్తజనులకు నీడ కల్పించే బస్టాండ్ భవనం ప్రమాదకరంగా ఉంది. శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా తయారైంది. చినుకు పడితే పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతుండడంతో ప్రయాణికులకు దిక్కుతోచని పరిస్థితి ఎదువుతోంది. చివరకు ఆర్టీసీ ఉద్యోగులు సైతం ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని విధులు నిర్వర్తించాలని దుస్థితి దాపురించింది.

తిరుపతి అర్బన్ : నగరంలోని సెంట్రల్ బస్టాండ్ 67 ప్లాట్‌ఫామ్‌లతో 13 ఎకరాల్లో ఉంది. ఈ ప్రాంగణంలోనే శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లెవెలుగు పేరుతో నాలుగు బస్టాండ్లు ఉన్నాయి. అయితే శ్రీహరి బస్టాండ్ భవనం పరిస్థితి దయనీయంగా మారింది. శ్లాబ్ నుంచి ఎక్కడపడితే అక్కడ పెచ్చులు ఊడిపడుతున్నాయి. మరోవైపు 100 మీటర్ల పొడవైన పిట్టగోడ పూర్తిగా దెబ్బతింది. పిట్టగోడ నుంచి పెచ్చులు ఊడి బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులపై పడుతుండడంతో జూలైలో 15 మీటర్ల మేర తొలిగించారు. అయితే ఇప్పటి వరకు తిరిగి నిర్మించలేదు. దీంతో భవనం పైభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. పై భాగం మొత్తం పాచిపట్టి పోయి జారుడుబల్లలాగా మారింది. పిట్టగోడ లేకపోవడంతో ఎవరైనా పొరపాటున జారితే కింద పడిపోవాల్సిందేనని ఆర్టీసీ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కింద భాగంలో ప్రయాణికుల మీద పైకప్పు నుంచి చిన్న చిన్న పెచ్చులు ఊడిపడుతుండడంతో పలువురు గాయాలపాలవుతున్నారు. ప్రయాణికులు, ఉద్యోగుల సంరక్షణ చూడాల్సిన ఆర్టీసీ అధికారులు అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తొలగించిన పిట్టగోడను నిర్మించాలని, భవనానికి కనీసం మరమ్మతులైనా చేయించాలని కోరుతున్నారు.



కూలేందుకు సిద్ధంగా శ్లాబ్

> **సమస్య పరిష్కరిస్తాం**
>
> 
>
> తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలోని శ్రీహరి బస్టాండ్ పిట్టగోడ ప్రమాదరస్థితిలో ఉండడంతో కొంతభాగాన్ని తొలగించాం. దీంతో ఇబ్బందిగానే ఉంది. త్వరలో తిరిగి నిర్మిస్తాం. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం. పలుచోట్ల శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతోందన్నది వాస్తవమే. ఆ సమస్య పరిష్కారిస్తాం. మరమ్మతులకు చర్యలు చేపడతాం.
>
> **- డీఆర్ నాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, సెంట్రల్ బస్టాండ్**

డిసెంబర్ 14 లోకదాలత్



మాట్లాడుతున్న జడ్జి పూర్ణిమాదేవి

పాకాల : కేసుల సత్వర పరిష్కారం కోసం డిసెంబర్ 14వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు న్యాయమూర్తి పూర్ణిమాదేవి తెలిపారు. బుధవారం ఈ మేరకు అధికారులతో సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోకుండా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు సహకరించాలని కో రారు. సమావేశంలో సీఐలు మద్దయ్య ఆచారి, సూర్యనారాయణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ తదితరులు

రామచంద్రాపురం: మండలంలోని కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు సొసైటీ ఫర్ సోషియల్ సర్వీస్ సంస్థ వానే బుధవారం విద్యా సామగ్రి అందజేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓ జయవేలు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ చంద్రశేఖర్ చేతులమీదుగా విద్యార్థులకు నోటుపుస్తకాలు, రైటింగ్ ప్యాడ్‌లు, జామెంట్రీ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు పంపిణీ చేశా రు. సంస్థ కార్యదర్శి సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతంగా ఎద గాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం వాగ్దేవి పాల్గొన్నారు.

బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ

తిరుపతి సిటీ : ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియా పిలుపునిచ్చారు. బుధవారం ఇస్కాన్ టెంపుల్ క్రీడాప్రాంగణంలో ఈ-బైక్ ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. కల్నల్ మాట్లాడుతూ ఈ-వాహనాల వినియోగం పెంచేందుకే ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ కల్నల్ ప్రేమ్ చంద్ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కల్నల్ సతీందర్ దహియా

‘రాసాని’ నవలల ఆవిష్కరణ



నవలలు ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ సెనేట్ హాల్‌లో డాక్టర్ పత్తిపాటి వివేక్ అధ్యక్షతన రాసాని నవలలను ఘనంగా ఆవిష్కరించారు. ముఖ్య అతిథి రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ రచయిత రాసాని తెలుగు సాహిత్యంలో అరుదైన అంశాల్ని కథలుగా, నవలలుగా, నాటకాలుగా మలిచారని కొనియాడారు. తెలుగు అధ్యాపకులు యువ శ్రీ మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంతో విభిన్న శైలితో రాసిన నవల రక్తచందనం అని వెల్లడించారు. అనంతరం కపిరి, రక్తచందనం నవలలను ఆవిష్కరించారు. మేడిపల్లి రవికుమార్, కొత్వాలు అమరేంద్ర, తలారి నాదముని రెడ్డి, రచయితలు బాలాజీ, కృష్ణస్వామి రాజు, మౌని, మిమిక్రీ విజయకుమార్, వి.షణ్ముగం, విశ్వనాథం, ఆకాశవాణి డైరెక్టర్ కృష్ణమోహన్, విశ్రాంత డీఎస్పీ నంజుండప్ప, రాజు పాల్గొన్నారు.

లీజు అగ్రిమెంట్‌తో కబ్జాకు యత్నం

తిరుపతి కల్చరల్ : గాంధీపురంలోని తమ స్థలాన్ని లీజుకు తీసుకుని అగ్రిమెంట్ గడువు పూర్తయినా ఖాళీ చేయకుండా కబ్జా చేసేందుకు ఓ మహిళ యతిస్తోందని బాధితుడు రాజేశ్వరరావు ఆరోపించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. పద్మనాభ ఆచారి అనే వ్యక్తి నుంచి 2016లో 140 అంకణాలు కొనుగోలు చేశామన్నారు. 2020లో ధర్మవరానికి చెందని యశోద అనే మహిళ ఓ పరిశ్రమ స్థాపన కోసం 11నెలలకు తమ స్థలాన్ని లీజుకు తీసుకుందని వెల్లడించారు. అలాగే మరో రూ.6లక్షలను తమ వద్ద అప్పుగా తీసుకుని, చెక్కులు ఇచ్చిందని చెప్పారు. ఇప్పుడు లీజు సమయం పూర్తయినా స్థలం ఖాళీ చేయడం లేదని, 20 నెలలుగా బాడుగ సైతం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ఇచ్చిన చెక్కులు కూడా బౌన్స్ అయ్యాయని, దీనిపై కోర్టులో కేసు కూడా వేశామన్నారు. చివరకు తమపైనే దౌర్జన్యానికి సైతం పాల్పడుతోందని వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ నేత చిన్నం పెంచలయ్య పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



సినీ నటి ప్రభ

తిరుమల : తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో మాజీ ఎంపీ కేశినేని నాని, సినీ నటి ప్రభ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

ఇబ్బంది లేకుండా ‘అపార్’ నమోదు

తిరుపతి రూరల్ : విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అపార్ ఐడీ నమోదు చేయాలని ఎంపీడీఓ రామచంద్ర ఆదేశించారు. బుధవారం తిరుచానూరు జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన అపార్ నమోదు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ప్రణాళికాబద్ధంగా ఐడీ నమోదు పూర్తి చేయాలన్నారు. ఆయా కేంద్రాల వద్ద తాగునీటి వసతి కల్పించాలని సూచించారు.

ముగ్గురు సీఐలకు రెగ్యులర్ పోస్టింగ్

తిరుపతి రూరల్ : అటాచ్‌మెంట్‌లో ఉన్న ఇద్దరు సీఐలను రెగ్యులర్ పోస్టింగ్ ఇస్తూ అనంతపురం డీఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి రూరల్‌కు చిన్నగోవిందు, చంద్రగిరికి సుబ్బరామిరెడ్డి, యూనివర్సిటీ స్టేషన్‌కు రామయ్యను రెగ్యులర్ సీఐలుగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ ముగ్గురు సీఐలకు చంద్రగిరి నియోజకవర్గంతో సంబంధం ఉండటం విశేషం.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుపతి రూరల్ : నగరంలోని అలిపిరి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అలిపిరి, ఇస్కాన్ రోడ్డు, శాంతి నగర్, రామచంద్రనగర్, తిరుమల బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యర్థాలు తొలగించాలని వినతి

తిరుపతి తుడా : ఆటోనగర్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని ఎస్వీ ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా సర్వీస్ సొసైటీ చైర్మన్ పి.లోకనాథ రెడ్డి, కార్యదర్శి ఎంవీబీ శివకుమార్ కోరారు. బుధవారం ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్ మౌర్యకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ శానిటరీ సూపర్‌వైజర్ల నిర్లక్ష్యం కారణంగా ఈ దుస్థితి తలెత్తిందన్నారు. 2015 నుంచి ఏటా కార్పొరేషన్‌కు రూ. 25.06లక్షల పన్నులు చెల్లిస్తున్నామని వెల్లడించారు. అయితే ఆటోనగర్‌లో మౌలిక వసతులు కల్పించడం లేదని, పారిశుద్ధ్య చర్యలు సక్రమంగా చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీ టీచర్ల సమావేశం

పాకాల : స్థానిక ఎస్‌పీఎస్ పాఠశాల ఆవరణలో బుధవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు మనేరి ప్రభు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి గుండ్లపల్లి సుధాకర్ మాట్లాడుతూ 30శాతం ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలని స్పష్టం చేశారు.

హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్

తిరుపతి మంగళం : ప్రతి విద్యార్థికీ తమ హక్కులపై అవగాహన అవసరమని మహిళాభివృద్ధి, జిల్లా బాలల రక్షణ అధికారి శివశంకర్ తెలిపారు. బుధవారం స్త్రీ శిశు సంక్షేమశాఖ, రాస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు ఆపద సమయంలో టోల్ ఫ్రీ నెంబర్ 1098 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తిరుపతి ఐఈఈ సూపర్ వైజర్ శ్రీదేవి ,మిషన్ వాత్సల్య సిబ్బంది దేవయాని, కల్పన, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయని విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉన్నతంగా ఎదగాలి

విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్ తెలిపారు. బుధవారం మంగళం ప్రభుత్వ బాలుర గృహం, బాలుర పరిశీలన గృహం, బాలుర ప్రత్యేక గృహంలో బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిత్తూరు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్స్ పర్సన్ ఎం.వసంత, సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, జేజేబీ సభ్యులు మంజుల, నారాయణరెడ్డి, గృహం పర్యవేక్షణాధికారులు షణ్ముఖరావు, త్రినాథ రావు, శరత్ బాబు, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి సుదర్శన రెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు మోహన్ బాబు, లక్ష్మీపతి, సూపరింటెండెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి సంధ్యారాణి

సమాజానికి ఉపయోగపడాలి

తిరుపతి కల్చరల్ : సరోజినీదేవి రోడ్డులోని ప్రభుత్వ బాలికల వసతిగృహంలో బుధవారం బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. మూడో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ సంధ్యారాణి మాట్లాడుతూ విద్యతో జ్ఞానం పెంపొందించుకుని సమాజానికి ఉపయోగపడాలని కోరారు. బాలల న్యాయ మండలి సభ్యుడు నారాయణరెడ్డి, న్యాయవాది మంజుల, కేవీ.మల్లేశ్వరిదేవి, పారా లీగల్ వలంటీర్లు మహాలక్ష్మి, రేవతి, చైర్‌పర్సన్ ఎం.వసంతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పి.చంద్రశేఖర్‌రెడ్డి, పీవీ రవికుమార్, కృష్ణమనాయుడు, మురళీమోహన్ పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

తిరుపతి తుడా : నగరంలో సేకరించే వ్యర్థాల నిర్వహణ తీరుతెన్నులను కమిషనర్ మౌర్య సమీక్షించారు. బుధవారం ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ తూకివాకం వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. నగరంలో ఇంటింటా తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలన్నారు. తూకివాకంలోని, అన్ని ప్లాంట్లు 100 శాతం పనిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. నగరంలో భవన నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని,,మురుగునీటి శుద్ధి కేంద్రం నీటి సాంద్రతను తిరుపతి ఐఐటీ వారితో పరీక్షలు చేయించాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

రెండోరోజుకు రుద్రయాగం



యాగం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న రుద్రయాగం బుధవారం రెండో రోజుకు చేరుకుంది. అందులో భాగంగా యాగశాలలో ఉదయం పూజ, రుద్రజపం, హోమం లఘు పూర్ణాహుతి, నివేదన హారతి చేపట్టారు. సాయంత్రం పూజ, జపం, హోమం రుద్ర త్రిశతి, నివేదన, విశేష దీపారాధన, హారతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో టెక్నికల్ ఫెస్ట్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులో ఎస్వీసీఈ కళాశాలలో టెక్ స్పార్క్-2024 పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ బుధవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా చెన్నై ఎస్ఆర్‌ఎమ్ వర్సిటీ కెరీర్ సెంటర్ డైరెక్టర్ వెంకటశాస్త్రి నరసింహదేవర పాల్గొన్నారు. ఎస్వీసీఈ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు టెక్నికల్ స్కిల్స్‌ను వృద్ధి చేసుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ తారకేశ్వర్, డాక్టర్ అబ్దుల్ కలామ్, వి.మధురిమ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న శ్రీనివాసులునాయుడు

తిరుపతి అర్బన్ : పుస్తక పఠనంతో విజ్ఞానం పొందవచ్చని కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులునాయుడు తెలిపారు. బుధవారం అన్నమయ్య సర్కిల్ సమీపంలోని గ్రేడ్-1 లైబ్రరీలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ హరిప్రసాద్, లైబ్రేరియన్ శివప్రసాద్, డాక్టర్ శ్రీధర్, నారాయణ, తహసున్నీసాబేగం, మునిలక్ష్మి, సోము ఉమాపతి, కళా సాగర్, గోవిందు, వసంతమ్మ, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే గోవిందరాజుల స్వామి గుడి సమీపంలోని ప్రాంతీయ గ్రంథాలయాధికారి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో వారోత్సవాలను ముగించారు.

చంద్రగిరి: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఎంఈఓ లలిత కుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆమె మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా గ్రంథాలయాలు అందరికీ నేస్తాలుగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రెడ్డెమ్మ పాల్గొన్నారు. తిరుచానూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంచార్జి హెచ్‌ఎం ప్రశాంతి ఆధ్వర్యంలో వారోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. లైబ్రేరియన్ నాగరాణి, ఉపాధ్యాయుడు వెంకటముని పాల్గొన్నారు.

పాకాల : మండలంలోని దామలచెరువు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఇన్‌చార్జి లైబ్రేరియన్ పున్నాగు మురళీబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయానికి రావాలని కోరారు. విజయ స్కూల్ హెచ్‌ఎం మాధవిరెడ్డి, శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ హెచ్‌ఎం పార్థసారథి పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలు



హాకతాన్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఉమ

తిరుపతి సిటీ: సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు, పరిశోధనలపై దృష్టి సారించాలని వీసీ ప్రొఫెసర్ వి.ఉమ పిలుపునిచ్చారు. మహిళా వర్సిటీ బయోటెక్ ఇంక్యుబేషన్ ఫెసిలిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం మూడు రోజుల హాకతాన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థినులు ప్రదర్శించిన ఆరోగ్యం, పర్యావరణం, ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించి ఆవిష్కరణల నమూనాల పనితీరును వీసీ అడిగి తెలుసుకున్నారు. డీన్లు సుజాతమ్మ, వాణి, ఎస్ఓఈటీ డైరెక్టర్ మల్లికార్జున, విద్యావతి, సూర్యకుమార్, కళారాణి, వంశీ, డాక్టర్ మోహన్ పాల్గొన్నారు.

లైఫ్ స్కిల్స్‌తో లక్ష్య సాధన

విద్యార్థులు అకడమిక్ విద్యతో పాటు లైఫ్ స్కిల్స్‌పై దృష్టి సారించి వాటిని పెంపొందించుకుంటే ఉన్నత లక్ష్యాన్ని సాధించవచ్చని వీసీ ప్రొఫెసర్ వి.ఉమ అన్నారు. మహిళా వర్సిటీ సావేరి అతిథిగృహంలో నూతన విద్యార్థులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఓరియెంటేషన్ కార్యక్రమం బుధవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా ఉమ విద్యార్థినులకు మార్గదర్శనం చేశారు. ప్రధానంగా కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ రిలేషన్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్, డెసిషన్ మేకింగ్, క్రియేటివిటీ, కోపింగ్ విత్ స్ట్రెస్ అండ్ ఎమోషన్ వంటి వాటిలో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజిని, డైరెక్టరేట్ అఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ సువర్ణలత దేవి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ జై కాత్యాయని , పబ్లిక్ రిలేషనల్ ఆఫీసర్ డాక్టర్ రజని, కొత్తగా అడ్మిషన్లు పొందిన సుమారు 970మంది విద్యార్థినులు పాల్గొన్నారు.